క్లుప్తంగా

నేడు సంకష్టహర చతుర్థి పూజలు


కన్నెముల గణపతి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెంలో వేంచేసియున్న హరిహరసుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఉపాలయమైన శ్రీ కన్నెముల గణపతికి సంకష్టహర చతుర్థి సందర్భంగా 17వ తేదీ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ తెలిపింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆలయ ప్రధాన అర్చకులు తేజ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు, గణపతి హోమం నిర్వహిస్తున్నామని, కావున భక్తులందరూ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

19న అయ్యప్పకు ప్రత్యేక పూజలు


అయ్యప్ప స్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెంలో వేంచేసియున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో 19వ తేదీ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ తెలిపింది. స్వామి వారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆలయ ప్రధాన అర్చకులు తేజ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి మండపారాధన, పుణ్యాహ వాచనం, పంచామృత అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, నీరాజనం, మంత్ర పుష్పాలు తదితర పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 6305982909 నెంబరును సంప్రదించాలన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి


పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రైతులు ఈ-పంట నమోదు తప్పని సరి చేసుకోవాలి అని మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు గురువారం సరిపల్లి, సీతంపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీ పంటకు వరి, మొక్కజొన్న, క్రాప్ ఇన్సూరెన్స్ నమోదు వలన వారికి లబ్ధి చేకూరుతుందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది అందుకు అనుగుణంగా రైతుల చేత ఈ-పంట నమోదు కార్యక్రమ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మొక్కజొన్న, పొగాకు పంటల వ్యవసాయ క్షేత్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన, పంటలపై సూచనలు సలహాలు అందజేశారు.

వైభవంగా కడెమ్మ తల్లి గ్రామోత్సవం


కడెమ్మతల్లి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం గ్రామ దేవత కడెమ్మ తల్లికి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించి గరగ నృత్యాలు, వాయిద్యాలతో బాణసంచా కాల్పులతో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. రకజ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు.

మహానందీశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ


మహానందీశ్వరుడు

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్య మహానందీశ్వరస్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది. సంక్రాంతి సెలవులు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు దేవాలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు దిగువన నది మధ్యలో ఈ ఆలయం ఉంది. ఈ ఆలయానికి వెళ్లేందుకు వీలుగా ఇటీవల రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడంతో భక్తులు నేరుగా దేవాలయం వరకు వాహనాలపై చేరుకున్నారు. దీంతో దేవాలయం భక్తులతో కళకళలాడింది.

ఆహ్లాదకరంగా అంగన్‌వాడీలు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీషన్ గార్డెన్లు
- పౌష్టికాహారం అందించడమే లక్ష్యం


అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు పెంచుతున్న హెల్పర్

బుట్టాయగూడెం: ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎటు చూసినా పచ్చదనం, అందమైన పూల మొక్కలతో ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. అలాగే వీటితో పాటు కూరగాయలు, ఆరోగ్యాన్నిచ్చే ఆకుకూరలు వంటివి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ కార్యకర్తలు పెంచుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు కలుషితం లేని ఆహారం అందించాలనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీషన్ గార్డెన్లను ఏర్పాటు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణంలో రకరకాల మొక్కలతో పచ్చదనం చూపరులను ఆకట్టుకుంటుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు సేంద్రియ ఎరువుల ద్వారా పెంచుతున్న తోటకూర, గోంగూర, మెంతికూర, బచ్చలికూర, పాలకూరతో పాటు వంగ, బెండ, చిక్కుడు, తదితర కూరగాయలను పెంచి వారికి ఆహారంగా అందిస్తున్నారు. అలాగే రకరకాల పూల మొక్కలను కూడా పెంచి కార్యకర్తలు వాటిని రక్షిస్తున్నారు. ఎటువంటి రసాయనిక ఎరువులు లేకుండా వీటిని పెంచుతున్నారు.

ప్రాజెక్టు పరిధిలో 63 న్యూట్రీషన్ గార్డెన్లు

బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీషన్ గార్డెన్లను కార్యకర్తలు పెంచుతున్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పోషణ అభియాన్ పథకంలో న్యూట్రీషన్ గార్డెన్లను ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఒక్క బుట్టాయగూడెం మండలంలోనే సుమారు 63 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన న్యూట్రీషన్ గార్డెన్లు కళకళలాడుతూ కనిపిస్తున్నాయి.

నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, బాలింతలు, గర్భిణులకు కలుషితం లేని నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పోషణ అభియాన్ పథకాన్ని అమలు చేస్తుంది. దీనిలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు భోజనానికి కావాల్సిన ఆకుకూరలు, కూరగాయలను పండించి వారికి వండి పెట్టే విధంగా కృషి చేస్తున్నాం. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహ్లాదం కోసం అందమైన పూల మొక్కలను కూడా పెంచేలా కృషి చేస్తున్నాం.

ఇ. తులసి, సీడీపీఓ, బుట్టాయగూడెం

ముస్లిం విద్యార్థినికి అభినందనలు


ముస్లిం విద్యార్థినిని అభినందిస్తున్న ఫారుఖీ మసీదు కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: ప్రస్తుత సమాజంలో విద్యార్థి దశలోనే మాతృభాషైన ఉర్దూ, అరబిక్‌లో విద్యాబుద్ధులు నేర్చుకుని ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని లక్కవరం ఫారుఖీ మసీదు కమిటీ అధ్యక్షుడు పి.అన్వర్ బాషా ఉపదేశించారు. గురువారం లక్కవరంలో పకీర్‌షా ఇంటి వద్ద మసీదు కమిటీ, ముస్లిం పెద్దల సమక్షంలో ఆసిఫా అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అభినందనలు తెలుపుతూ సన్మానం చేశారు. ఈ సందర్భంగా పి.అన్వర్ బాషా మాట్లాడుతూ మసీదు కమిటీ ఉపాధ్యక్షుడైన షేక్ పకీర్ షా మనుమరాలు ఆసిఫా ముందూరు జనాబ్ ఒసివుల్లా నిర్వహిస్తున్న మదర్సాలో ఇటీవల ఇంగ్లీష్ జనరల్ నాలెడ్జ్‌లో స్టేట్ టాపర్‌గా అవార్డు సాధించిందన్నారు. కమిటీ కోశాధికారి నాసిర్, పఠాన్, అజ్‌ఘర్ వలి, రహంతుల్లా, సయ్యద్ బాషా, ముంతాజ్ పాల్గొని అభినందనలు తెలిపారు.

కనుల పండువగా అధ్యయనోత్సవాలు


క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి రోజు నుంచి అధ్యయనోత్సవాలు కనుల పండువగా ని టర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం రాత్రి శ్రీవారు, అమ్మవార్లకు నిర్వహించిన తిరువీధి సేవ భక్తులకు కనువిందు చేసింది. ముందుగా నిత్య కల్యాణ మండపంలో స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో శ్రీవారిని తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. ఆ తరువాత వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టి, నీరాజనాలు సమర్పించారు. ఈ అధ్యయనోత్సవాలు ఈ నెల 20 వరకు నిర్వహిస్తారు.

కనుమ ఉత్సవంలో అర్చక స్వాముల సందడి


కనుమ ఉత్సవంలో అర్చక స్వాములు

ద్వారకాతిరుమల: శ్రీవారి సేవల్లో అర్చక స్వాముల పాత్ర ఎంతో గొప్పది. గర్భాలయంలో స్వామివారి మూలవిరాట్‌ను, ఉత్సవ మూర్తులను నేరుగా తాకే భాగ్యం వారికి మాత్రమే ఉంది. వారు లేనిదే ఏ ఉత్సవం ముందుకు సాగదు. అందుకే భక్తులు అర్చక స్వాములను సైతం దైవంగా భావిస్తారు. ఎక్కువ మంది అర్చకులు ఒకే వేడుకలో కనిపిస్తే ఆ వేడుకలో ఉండే సందడే వేరు. అటువంటి సందడి బుధవారం శ్రీవారికి నిర్వహించిన కనుమ ఉత్సవంలో కనిపించింది. ద్వారకాతిరుమల నుంచి దొరసానిపాడుకు వెళ్లే మార్గమధ్యంలో అర్చక స్వాములు శ్రీవారి వాహనం ముందు వెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఫొటో గురువారం పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

హరిదాసుకు వీడ్కోలు


టీవీఎస్ మోపెడ్‌పై హరిదాసు

పోలవరం రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా నెల రోజుల పాటు గ్రామంలో హరిదాసు హరినామ సంకీర్తనలు చేస్తూ వీధి వీధిన తిరిగారు. ముక్కనుమ ఆఖరి పండుగ సందర్భంగా గ్రామస్తులు హరిదాసుకు ఘనంగా వీడ్కోలు పలికారు. గతంలో హరిదాసులు కాలినడకన తిరిగేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా హరిదాసులు సైతం నూతన విధానాన్ని అనుసరిస్తున్నారు. టీవీఎస్ మోపెడ్‌కు మైక్ పెట్టి హరినామ సంకీర్తన చేస్తూ ఇంటింటికీ తిరుగుతున్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు


చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి సాయంకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు హరి శ్రీనివాస శాస్త్రి కుచేలోపాఖ్యానం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7.30 గంటలకు నగరానికి చెందిన అభినయ నృత్య భారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచార్య డి.హేమ సుందర్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఇక కాంప్లెక్స్ విధానం రద్దు

- నియోజకవర్గంలో 21కి 8 కాంప్లెక్స్‌లు క్లస్టర్‌కు విలీనం
- క్లస్టర్ హెచ్‌ఎంలకు ఎంఈఓ అధికారాలు
- 8 మంది సీఆర్‌ఎంటీల భవిష్యత్‌పై ప్రభావం
- నేడు మండలాల్లో క్లస్టర్ పునర్వ్యవస్థీకరణ సమావేశాలు


గణపవరం బాలుర క్లస్టర్‌లో విలీనం అవుతున్న బాలికల జెడ్పీ కాంప్లెక్స్

మండలం	ప్రైమరీ / యూపీ స్కూల్స్	కాంప్లెక్స్‌లు	క్లస్టర్లు
నిడమర్రు	33	04	03
గణపవరం	48	06	03
భీమడోలు	37	05	03
ఉంగుటూరు	56	06	04
మొత్తం	174	21	13

నిడమర్రు: పాఠశాల విద్యాశాఖలో కీలకమైన పాఠశాల సముదాయాల స్థానంలో క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న 21 పాఠశాల సముదాయాలు స్థానంలో 13 క్లస్టర్లను ఏర్పాటు చేసేలా మండల విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో 8 పాఠశాల సముదాయాలు దగ్గరలో ఉన్న క్లస్టర్లలో విలీనం కానున్నాయి. ప్రతి క్లస్టర్‌కు గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 10 నుంచి 15 పాఠశాలలు అనుసంధానం చేసేలా విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. క్లస్టర్‌లో 40 నుంచి 50 మంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఇకపై ప్రతి నెలా పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు కొత్త విధానంలో నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ, పాఠశాలలు మధ్య విద్య అనుసంధానం, విద్యా వనరుల సామగ్రి తయారీ, తనిఖీలు, విద్యావ్యవస్థ పర్యవేక్షణ తదితర కార్యక్రమాలు క్లస్టర్ కేంద్రంగా నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొంది.

క్లస్టర్ హెచ్‌ఎంలే కీలకం

కొత్త విధానంలో క్లస్టర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కీలకంగా మారనున్నాయి. మండల యూనిట్‌లో ప్రస్తుతం డీడీఓ అధికారాలు ఎంఈఓలకు ఉండగా.. ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికి త్వరలో క్లస్టర్ స్కూల్ హెచ్‌ఎంకు జీతాల పంపిణీ అధికారం బదలాయింపు చేయనున్నారు. ఎంఈఓలు పరిపాలన సంబంధ అంశాలకు మాత్రమే పరిమితం కానున్నారు. క్లస్టర్ స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులపై ప్రస్తుతం ఉన్న రోజు వారీ విధులకు అదనంగా క్లస్టర్ నిర్వహణ భారం పడటంతో పాటు ఎంఈఓలు నిర్వహిస్తున్న డీడీఓ బాధ్యతలను కూడా క్లస్టర్ హెచ్‌ఎంకే ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

సీఆర్పీల భవిష్యత్ ప్రశ్నార్థకం

ప్రభుత్వ స్కూళ్లలో బోధనా అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే స్కూల్ కాంప్లెక్స్‌లను కూటమి ప్రభుత్వం తగ్గించనున్నది. ఇందులో పనిచేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్లను కూడా తగ్గించనున్నట్టు తెలుస్తోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో 21 కాంప్లెక్స్‌లకు బదులు 13 క్లస్టర్లుగా పునర్నిర్మాణం చేయనున్నారు. దీంతో ఇప్పటి వరకూ కాంప్లెక్స్‌లో విధులు నిర్వహిస్తున్న 21 సీఆర్పీలు బదులు 8 మంది సీఆర్పీల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది. రెండు దశాబ్దాలుగా కాంట్రాక్టు విధానంలో నియమితులైన సీఆర్పీలు బీఈడీ అర్హత ఉండడంతో గత ప్రభుత్వ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు (సీఆర్‌ఎంటీ)గా గుర్తింపు ఇవ్వడంతో పాటు మండలంలో ఎక్కడైనా ఉపాధ్యాయులు సెలవులో ఉన్నప్పుడు బోధనకు అంతరాయం లేకుండా వీరు పనిచేసేలా చర్యలు తీసుకుంది. ఇప్పుడు క్లస్టర్ విధానం అములలో సగం మందిని తగ్గించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. మిగులు సీఆర్‌ఎంటీలకు మరో ప్రత్యామ్నాయం చూపుతారా లేదా అనే విషయంపై ఇంకా విద్యాశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సీఆర్పీలు ఆందోళన చెందుతున్నారు.

నేడు క్లస్టర్ రీఆర్గనైజేషన్‌పై సమావేశం



శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంఈఓ కార్యాలయంలో పాఠశాల సముదాయాల చైర్మన్లతో సమావేశం ఏర్పాటు చేశాం. ఇందులో జీఓ 117, క్లస్టర్ రీఆర్గనైజేషన్‌పై చర్చించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఇందులో భాగంగా అర్ధవరం కాంప్లెక్స్ పిప్పరలో, బాలికల కాంప్లెక్స్‌ను బాలురులో, కాశిపాడు కాంప్లెక్స్‌ను కేశవరంలో విలీనం చేయనున్నారు.

– గొర్రెల బాలయ్య, ఎంఈవో–2, గణపవరం

శుభాకాంక్షలు కాదు.. వేతనాలివ్వండి

కుక్కునూరు: మాకు కావాల్సింది సంక్రాంతి శుభాకాంక్షలు కాదని బకాయి వేతనాలను విడుదల చేయాలని వెలుగు యానిమేటర్ల ఆధ్వర్యంలో సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం కోసం గ్రామీణ పేదరిక నిర్మూలనకు అహర్నిశలు కృషి చేస్తున్న యానిమేటర్లు చాలీచాలని జీతాలతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కుంటుంటే, ప్రభుత్వం మాత్రం వారి సమస్యలను పట్టించుకోకుండా ఆరు నెలలు నుంచి వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒక్క సారి కూడా వేతనాలు ఇవ్వలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా యానిమేటర్ల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పోచారపు వెంకటేశ్వర్లు, షేక్ వలి పాషా, కాకర్ల శ్రీను, తిరోజుల సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చెట్లకొమ్మల తొలగింపు, వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు సబ్‌స్టేషన్ల పరిధిలోని శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పెదవేగి మండలం రాయుడుపాలెం, కొండలరావు పాలెం, రాట్నాలకుంట, లేళ్లగూడెం గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ధర్మాజీగూడెం సబ్ స్టేషన్ పరిధిలో కతమారెడ్డిపల్లి, ధర్మాజీగూడెం ఇండస్ట్రియల్ సర్వీసులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, లింగపాలెం మండలం రంగాపురం, ములగలంపాడు, కొత్తపల్లి, ముడిచెర్ల, కె.గోకవరం, గణపవారి గూడెం, అన్నపనేనివారి గూడెం, పుష్పాల వారి గూడెం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. పెదవేగి, కవ్వగుంట సబ్ స్టేషన్ల పరిధిలో పెదవేగి, గార్లమడుగు, సూర్యారావు పేట, లక్ష్మీపురం, ఎంఆర్‌సీ కాలనీ, న్యాయం పల్లి, కవ్వగుంట, ములక్కాయల పాడు గ్రామాలకు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని వివరించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని కొమ్మరలో కోడి పందేల స్థావరంపై గురువారం మధ్యాహ్నం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.10,270, రెండు కోడి పంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

రైతు బజారు.. సమస్యలతో బేజారు


తనకు కేటాయించిన దుకాణాన్ని ఒదిలి నడకదారిలో ఆకు కూరలు అమ్ముతున్న వ్యాపారి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వినియోగదారులకు అందుబాటు ధరలకు కూరగాయలు అందించేందుకు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో నెలకొల్పిన ఏలూరు నగరంలోని పత్తేబాద రైతు బజారులో అడుగడుగునా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వీటిపై వినియోగదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకున్న దాఖలాలు ఉండవు. ఒకవేళ ఒక రోజు వచ్చి కొంత హడావుడి చేసి సమస్యలు పరిష్కరించినా.. తరువాతి రోజు నుంచి షరా మామూలే అన్న చందంగా ఇక్కడి పరిస్థితి కొనసాగుతోంది. దీంతో ఇక్కడికి నిత్యం వచ్చే మూడు వేల నుంచి నాలుగు వేల మంది వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

వాహనాల పార్కింగ్‌కు పాట్లు

పార్కింగ్‌కు చోటులేక వినియోగదారులు తమ వాహనాలను రైతు బజారు ముఖద్వారం వద్దనే నిలిపివేస్తారు. ఇక్కడ గతంలో వాహనాల పార్కింగ్‌కు చోటు ఉండేది. అయితే కొందరు ప్రజా ప్రతినిధుల సిఫార్సులతో ఆ ప్రాంతంలో బడ్డీ కొట్లు ఏర్పాటు చేసుకోవడంతో పార్కింగ్ ప్రదేశం కొద్దిగానే మిగిలింది. ఈ కొద్ది స్థలంలోనూ వాహనాలను నిలపకుండా వినియోగదారులను బడ్డీ కొట్టు వ్యాపారాలు అడ్డుకుంటున్నారు. దీంతో చేసేదేమీ లేక రోడ్డుమీదనే వాహనాలను నిలుపుకోవాల్సి వస్తుంది. ఫలితంగా పత్తేబాద రహదారి ఇరుకుగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

నడిచే చోటే వ్యాపారాలు

రైతు బజారులో వ్యాపారులు తమకు కేటాయించిన దుకాణాల ముందు భాగంలో పెద్దపెద్ద ట్రేలు పెట్టి వినియోగదారులు నడిచే దారిని ఆక్రమించుకుంటున్నారు. దీంతో ఒకరికి ఇకరు ఎదురుపడితే ఒకరు తప్పుకుని, మరొకరికి మార్గం ఇస్తే గాని నడిచే పరిస్థితి లేదు. దారికి అడ్డంగా పెట్టిన ట్రేలను తొలగించాలని ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వ్యాపారులు తొలగించకపోవడం చూస్తుంటే వారిపై అధికారులకు నియంత్రణ లోపించినట్టుగా అర్థమౌతుంది. తమకు కేటాయించిన దుకాణాలను వదిలి, దానికి ముందుకొచ్చి బల్లలు ఏర్పాటు చేసి ఆకు కూరలను విక్రయిస్తున్నారు.

ప్రశ్నిస్తే బూతుపురాణాలు

కొందరు వ్యాపారులు తూకాల్లో మోసాలు చేస్తున్నట్టు అనుమానమొచ్చి ప్రశ్నిస్తే వారిపై బూతు పురాణాలు అందుకుంటున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్డు రేటు కంటే అధిక ధరలకు కూరగాయాలు విక్రయిస్తుండడాన్ని ప్రశ్నిస్తే ఏకవచనంతో సంబోధిస్తూ ఒక్కోసారి వారిపై దాడులకూ తెగబడుతుని వాపోతున్నారు. కొందరు వ్యాపారులు చిల్లరలేదనే నెపంతో ఉదాహరణకు రూ.8కి ఇవ్వాల్సిన కూరగాయలను రూ.10 వేసేశామని వసూలు చేస్తున్నారు. మరికొందరు వ్యాపారులు వివిధ రకాల కూరగాయలను గ్రేడింగ్ చేయించి మూడో రకం కూరగాయలను ఇక్కడికి తీసుకొచ్చి అంటగడుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి చర్యలపై ప్రశ్నించినా వ్యాపారుల నుంచి తిట్లు, దాడి ప్రయత్నాలు ఎదురౌతున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

రైతు బజారు సమస్యలపై సంబంధిత మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ ఇక్కడకు రావడం లేదా తనిఖీ చేయడం లేదా వ్యాపారులను నియంత్రించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితికి అధికారుల వైఫల్యమా లేక ప్రజా ప్రతినిధుల ఆదేశాల మేరకు ఒదిలేశారా అని నిలదీస్తున్నారు. కొందరు రిటైర్డ్ అధికారులు రైతు బజారుపై నియంత్రణ అధికారం జాయింట్ కలెక్టర్‌కు ఉంటుందని, దీనిపై చర్యలకు జాయింట్ కలెక్టరే ఉపక్రమిస్తేగాని పరిస్థితి అదుపులోకి రాదని వ్యాఖ్యానిస్తున్నారు.